www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 26 జులై 2025

5

చిత్తూరు



నేడు జిల్లాకు కేంద్ర సాధికార కమిటీ సభ్యుల రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్ శని, ఆదివారాల్లో జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం సమయంలో విజయవాడ నుండి విమానంలో బయలుదేరి ఉదయం 11.20 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా చిత్తూరు పట్టణానికి మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటారు. పలమనేరు, టేకుమంద రిజర్వ్ ఫారెస్టుల మీదుగా బెంగళూరు - చెన్నై (గ్రీన్ఫీల్డ్) ఎక్స్‌ప్రెస్ హైవే ఫేస్-2 నిర్మాణం విషయమై ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చిస్తారు. బెంగళూరు -చెన్నై ఎక్స్ప్రెస్ హైవే ప్రతిపాదనలో భాగంగా కౌండిన్య వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలో వచ్చే అటవీయేతర విస్తరణ తదితర అంశాలను చర్చిస్తారు. రాత్రి చిత్తూరులో విడిది చేస్తారు. ఆదివారం ఉదయం చిత్తూరు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తిరుపతికి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో 65,451 కుటుంబాల గుర్తింపు



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమం ద్వారా నిర్వహించిన గ్రామసభల వివరాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పి-4 కార్యక్రమం గ్రామసభల నిర్వహణ, బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపిక తదతర అంశాలపై వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సచివాలయంలో 10మంది మార్గదర్శకులను ఎంపిక ప్రక్రియ రేపటినుండి నిర్వహించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ ఈనెల 30 తేదీ లోపల పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, పై కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ఆదేశించారు, గ్రామసభ్యులు నిర్వహించి, డోర్ టు డోర్ వెరిఫై చేసి ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 65,451 కుటుంబాలు గుర్తించబడ్డాయని, ప్రస్తుతం 6,515 కుటుంబాలు దత్తత తీసుకోబడ్డాయని తెలిపారు. ప్రవాసాంధ్రులను కూడా భాగస్వామం చేసేందుకు ఏపీ ఎన్నార్టీ సొసైటీ సాయం తీసుకోవాలని చెప్పారు. అలాగే కార్పొరేట్ సంస్థలు దీనికి కలిసి వచ్చేలా చూడటంతో పాటు వారితో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నదని తెలిపారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికే చెందిన ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలని సూచించారు. ఒకవేళ స్థానికంగా మార్గదర్శులు లేకపోతే అప్పుడు స్థానికేతరులను అనుసంధానం చేయాలని నిర్దేశించారు. నగిరి, పలమనేర్, సోమల, ఎంపీడీవో లతో పలు అంశాలపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్లు కూడా బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతిరోజు సాయంత్రం ఐదున్నర గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బంగారు కుటుంబాల మార్గదర్శుల ఎంపికపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆయా మండలాల ఎమ్మార్వోలు కూడా ఆయా మండలాల విఆర్ఓలకి పై కార్యక్రమాల అమలపై నిర్దేశాలు జారీ చేయాలని ఆదేశించారు. సిపిఓ, డీఈవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలలో ఎన్‌సిడి సెల్ ఏర్పాటు



వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎన్‌సిడి సెల్‌ను ఏర్పాటు చేసుకోవడానికి కార్యాచరణ ప్రణాళికలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత వైద్యసిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్యశాఖ, చిత్తూరు సిఎంసి ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ అంటువ్యాధి లేని జీవనశైలి వ్యాధులు దేశప్రజారోగ్య వ్యవస్థకు అనారోగ్యం, మరణాలు, ఆర్థికభారం రెండింటిలోనూ భారీ ముప్పును కలిగిస్తున్నాయని తెలిపారు. వయస్సు, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా జనాభాలోని అన్ని వర్గాలలో అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం జీవనశైలి వ్యాధుల పెరుగుదలకు దోహదపడ్డాయి, 30 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు గల ఉత్పాదక వయస్సు గలవారిలో మొత్తం మరణాలలో 52శాతం ఎన్‌సిడి ఏదో ఒక కారణం వల్ల సంభవిస్తున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయని తెలిపారు. 30 ఏళ్లు పైబడిన జనాభాకు వారి వ్యాధి పరిస్థితులతో సంబంధం లేకుండా నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల కోసం స్క్రీనింగ్, మరియు ఎన్‌సిడిలతో గుర్తించబడిన వారందరికీ ఉచిత మందుల సరఫరా చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతూ ఉందని జిల్లాలో అమలలో భాగంగా చిత్తూరు సిఎంసి, అపోలో హాస్పటల్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలోని ఏఎన్ఎం, తమెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఇతర వైద్య సిబ్బందికి ఎన్సీడీలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యశాఖ అధికారిని ఆదేశించారు. అతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిరిక్స్ హెల్త్‌కేర్ పరికరాలు కచ్చితంగా పనిచేస్తున్నయా లేదా డిఎం అండ్ హెచ్ఓ తనిఖీ చేయాలని ఆదేశించారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వార్డుల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ శంకరాయగుంట, అంబేద్కర్ నగర్, అశోకపురం, 30వ వార్డు టాప్ లైన్ ప్రాంతాల్లో పర్యటించారు. శంకరాయకుంట పుట్టవీధిలో స్థానికులతో మాట్లాడారు. నీటికి ఇబ్బందిగా ఉందని స్థానికలు తెలుపగా.. నీటి సమస్య పరిష్కారంపై ఇంజనీరింగ్ అధికారాలతో చర్చించారు. బోరు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంక్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంబేద్కర్ కాలనీలో పైప్ లైన్లను, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. 30వ వార్డు టాప్ లైన్లో నీటి సంపును పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిశీలించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏఈ లోకేష్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటో మ్యుటేషన్‌పై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట రమణమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆటో మ్యుటేషన్ విధానాన్ని అమలు చేస్తోందని, ఈ విషయంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ వెంకట రమణమూర్తి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆగస్టు 1 నుండి అమలు చేయనున్న ఆటో మ్యుటేషన్ విధానానంపై కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం చిత్తూరు గిరింపేటలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్, కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు, ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే.. యజమాని పేరుతో ఆస్తి బదలాయింపు ప్రక్రియ ఆటోమెటిగ్‌గా జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాగానే వివరాలు ఆన్‌లైన్ ద్వారా కార్పొరేషన్ అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ విధానంపై అవగాహన పెంచుకొని దస్త్రాలు జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. కొత్త విధానంలో ఆస్తి పన్ను, ఇతర బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ సాధ్యమవుతుందన్నారు. ఈనూతన విధానంపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో గోపాలకృష్ణ వర్మ, సబ్ రిజిస్ట్రార్‌లు, ఆర్ఐ అమరనాథ్ రెడ్డి, రిజిస్ట్రేషన్ అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

సిఐటియులోకి అంగన్వాడీలు చేరిక

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్



సిఐటియులో చేరిన అంగన్వాడీ వర్కర్లు

ప్రజాశక్తి- సోమల

పుంగనూరు ప్రాజెక్టు సోమల మండలం కందూరు సెక్టార్ అంగన్వాడీలు శుక్రవారం సమావేశం జరిపి ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా ప్రతిపక్షంలో వున్న ప్రస్తుతం ముఖ్యమంత్రి, మంత్రులు మేము అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు వేతనాల పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పటివరకు పెంచకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడానికి ప్రైవేటీకరణ చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నదని దానిని మానుకోవాలని అన్నారు. సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్వాడీలను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, ఒకే యాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. నిరంతరం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న యూనియన్‌లోకి తిరిగి రావడం అభినందనీయమని తెలిపారు. ఐక్యంగా తమ న్యాయమైన సమస్య పరిష్కారం కోసం పోరాటం చేద్దామని అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి సిఐటియు ముందుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు కూడా నిధులు కేటాయించి కష్టపడి పని చేస్తున్న అంగన్వాడీలకు వేతనాలు పెంచకపోతే భవిష్యత్తులో పోరాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పుంగనూరు ప్రాజెక్టు కార్యదర్శి లీలావతి, సుజాత పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఈశ్వరమ్మ, కార్యదర్శి ఉషారాణి, కోశాధికారి సుశీల, కమిటీ సభ్యులుగా నందిని, శారద, శోభారాణి, ఈశ్వరమ్మ, ద్రాక్ష వేణిలు ఎన్నికయ్యారు.

గురుకుల పాఠశాలలో తనిఖీలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి శుక్రవారం చిత్తూరు నగర పరిధిలోని సంజయ్ గాంధీ నగర్‌లోని గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు పరిశుద్ధమైన నీటిని మాత్రమే ఇవ్వాలని, అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తాజాగా ఇవ్వాలని, తయారుచేసిన ఆహార పదార్థాలను కిచెన్‌లో తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈనెల డెంగీ నివారణ మాసం సందర్భంగా పిల్లలకు డెంగీ రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై, పరిసరాలు నీరు నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం కచ్చితంగా పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు, తర్వాత, మలవిర్జన తర్వాత, మట్టిలో ఆడుకున్న తర్వాత కచ్చితంగా సబ్బుతో చేతుల శుభ్రపరుచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఏంఓ వేణుగోపాల్, డిపిఏంఓ డాక్టర్ ప్రవీణ, డాక్టర్ దయాసాగర్, అరుణ, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ప్రమాదకరంగా క్వారీ వ్యర్థాలు

ఆందోళన లో గ్రామస్తులు వాహనదారులు



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండలంలోని కటికపల్లి పంచాయతీలో చిత్తూరుకు చెందిన క్వారీని లీజుకు తీసుకున్న స్థానికులు సుబ్రమణ్యం నాయుడు తదితరులు క్వారీ నుంచి నుంచే వచ్చే వ్యర్థాలను పిల్లిగుండ్లుపల్లి, మంగుంట రోడ్డు పక్కన వేయడంతో వాహదారులు గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలుమార్లు హెచ్చరించినా లీజుదారు దీని తొలగించకపోగా యథేచ్ఛగా వ్యర్థాలు రోడ్డు పక్కన వేయడంతో పత్రిక దృష్టికి తీసుకువస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అటు మైన్స్ అధికారులు క్వారీలపై దృష్టి పెట్టకపోవడంతో క్వారీ వ్యర్థాలు ఇష్టారాజ్యంగా రోడ్డుపక్కనే పడవేస్తున్నారని దీనిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బోధనేతర పనులు తప్పించాలి

నేడు డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఉపాధ్యాయుల జీతాల సమస్య పరిష్కరించాలి, బోధనేతర పనులు తప్పించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ బదిలీలు చేపట్టి రెండు నెలలు పూర్తికావస్తున్న పొజిషన్ ఐడిలు కోసం క్యాడర్ స్ట్రెంత్ ఫైల్ ఇంత వరకు ఆమోదం పొందలేదని, నిన్న కాబినెట్ నెట్ సమావేశంలో చర్చ జరిపి ఆమోదం చేస్తామని చెప్పి వాటి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని ముఖ్యమంత్రి ఆమోదం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు కానీ ఇంత వరకు ముఖ్యమంత్రికి ఈ ఫైల్ చేరలేదని నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో జీతాలు సమస్య ఇంకా ఆలస్యమయ్యే పరిస్థితి కనబడుతోందని, పొజిషన్ ఐడి లేని ఉపాధ్యాయులు గత రెండు నెలలుగా జీతాలు పొందలేని పరిస్థితి ఏర్పడిందని అలాగే బోధనేతర కార్యక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

డ్వాక్రా మహిళల జీవనోపాధి పెరగాలి

కొత్త తరహా ఉపాధిపై దృష్టి పెట్టాలి: డిఆర్‌డిఏ పీడీ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)



స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులు పెరిగే విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది కృషి చేయాలని డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం చిత్తూరులోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో మెరుగైన కొత్త తరహా జీవనోపాధి అవకాశాలను గుర్తించాలన్నారు. కొత్త తరహా వ్యాపారాలపై సంఘ సభ్యులు మక్కువ చెబితే వారి ఆర్థిక స్థితిగతులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ దిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా మరింత అభివృద్ధి చేయడానికి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక వార్షిక ప్రణాళికతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు 2.0 ద్వారా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది ప్రత్యేకంగా బ్యాంకులు నుంచి వ్యక్తిగత రుణ సౌకర్యాలు కల్పించి వస్తు తయారీ సేవా రంగాల్లో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగు వేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలన్నీ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావాలంటే సిబ్బంది అంకితభావంతో పనిచేయాల్సి ఉందన్నారు. జిల్లాలో సుమారు 45 మంది లబ్ధిదారులకు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ ద్వారా రూ.50వేల విలువచేసే ఎగ్ కార్డులను కూడా అందించాలని నిర్ణయించామన్నారు. అలాగే రాయితీతో వ్యవసాయానికి వినియోగించే డ్రోన్‌లను కూడా అందించడం జరుగుతుందని, బాగా చదువుకుని సాంకేత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న మహిళ లబ్ధిదారులకు వీటిని అందించడం జరుగుతుందని, అలాంటి వారిని ఏపీఎంలు సీసీలు గుర్తించాలన్నారు. సంఘాల రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. రుణాలు దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలని సంఘాల ద్వారా తీసుకుని ప్రతి పైసా సద్వినియోగం కావాలని సూచించారు. డిపిఎంలు రవికుమార్, సునీతా లక్ష్మి, జిల్లాలోని ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఆ...పీఏను సస్పెండ్ చేయండి

సొంత పార్టీ నేతలే కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జీడీ నెల్లూరు ఎంఎల్ఏ థామస్ పీఏను సస్పెండ్ చేయాలంటూ సొంత పార్టీ నేతలే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జీడి నెల్లూరు ఎంఎల్ఏ పీఏగా పని చేస్తున్న చంద్రశేఖర్ (చందు) ఎంఎల్ఏ అండతో పలు అరాచకాలకు పాల్పడూ పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తున్నారంటూ జీడి నెల్లూరు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం నాయకులు హరిబాబు నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య మాట్లాడుతూ పీఏ చందు పార్టీని సర్వనాశనం చేస్తూ వైసిపికి కోవర్టుగా పనిచేస్తున్నట్లు ఆరోపించారు. ఎన్ఈజీఎస్ పనులు ఇతర వర్కులు ఆరు మండలాకు అనుచరులను ఏర్పాటు చేసుకొని అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఎంఎల్ఏ పీఏగా వున్న చందు అక్రమ ఆస్తులు సంపాదించారన్నారు. అక్రమ ఆస్తులపై విచారణ జరపాలని కోరారు.

భారీగా తగ్గిన శ్రీవారి హుండీ ఆదాయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



శ్రీవారి హుండీ ఆదాయం భారీగా తగ్గింది. గత ఏడాదితో పోల్చుకుంటే భక్తుల రద్దీ పెరిగినప్పటికీ హుండీ ఆదాయం మాత్రం మూడు కోట్ల మేర తగ్గింది.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3 లక్షల మంది భక్తులు ఎక్కువ దర్శనం చేసుకున్నారని తెలిపింది. అయితే హుండీ ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భారీగా తగ్గినట్టు టీటీడీ పేర్కొంది. ఈ ఏడాది తొలి ఆరునెలల్లో రూ.666.26 కోట్ల హుండీ ఆదాయం రాగా... గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.3 కోట్లు తక్కువ. భక్తుల రద్దీలో పెరుగుదల కనిపించినప్పటికీ, హుండీ కానుకల సగటు సమర్పణలో తగ్గుదల కారణంగా ఆదాయం తగ్గింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వివరాల ప్రకారం... గడిచిన ఆరునెలల కాలంలో సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం, ఇతర సేవల ద్వారా భక్తులకు సౌకర్యాలు కల్పించారు. 99 లక్షల మంది తలనీలాలు సమర్పించగా, 6.30 కోట్ల మంది అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే 12.14 కోట్ల లడ్డూలు విక్రయించబడ్డాయి. జనవరి 1, 2025న ఒక్క రోజులోనే లక్షకు పైగా భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకోగా.. ఆ ఒక్కరోజే రూ.3.13 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది. భక్తుల సౌకర్యం కోసం టీటీడీ ఆన్‌లైన్ టికెట్స్, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు (రూ.300), గదుల కేటాయింపు వంటి ఏర్పాట్లు చేసింది. అయితే రద్దీ సమయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలపై కొన్ని పరిమితులు విధించింది.

ఇక తిరుమలకు అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే..

5 ఎకరాల స్థలం కోరిన ఆర్టీసీ

350 బస్సులు నడిపేలా గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం మేరకు తిరుమలలో పర్యావరణ హితం కోరుతూ కాలుష్యరహితమైన ఎలక్ట్రానిక్ బస్సులు నడిపేందుకు నిర్ణయం జరిగింది. ఈ మేరకు 350 ఎలక్ట్రికల్ బస్సులు నడపనున్నారు. ఇందుకుగాను తిరుమలలో మోడల్ బస్‌స్టేషన్ ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం కావాలని టిడిని ఎపిఎస్ఆర్టీసి యాజమాన్యం కోరింది. ఇందుకు టిటిడి పాలకమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మొదటి విడతగా మంగళం డిపోకు 50 బస్సులు ఆగస్టు మొదటివారంలో రానున్నాయి. అయితే వాటి పార్కింగ్‌కు, ఛార్జింగ్‌కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ పనుల కోసం ఎస్‌పిడిసిఎల్ అధికారులకు 4.5 కోట్ల రూపాయలను ఆర్టీసీ చెల్లించింది.

తిరుమల తిరుపతి మధ్య మంగళం, తిరుమల, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, పీలేరు, పలమనేరు డిపోల నుంచి, ఇతర జిల్లాల నుంచి రోజుకు 400 పైగా డీజిల్ బస్సులు రవాణా సాగిస్తున్నాయి. డీజిల్ బస్సుల కారణంగా కాలుష్యం ఎక్కువై తిరుమలలో పర్యావరణం దెబ్బతింటుందన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, టిటిడిని సూచించింది. ఈ నేపథ్యంలో ఆస్థానంలో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బోర్డులోనూ ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలతో సమావేశమై తిరుమలలో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తే తప్ప పర్యావరణాన్ని పరిరక్షించలేమని తేల్చారు. తిరుమల శేషాచలం అడవుల మధ్య ఉండటం వల్ల పక్షులు, జంతుజాలం కాలుష్యం వల్ల అటవీ పరిసరాలన్నీ దెబ్బతీనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆర్నెళ్ల తరువాత తిరుమలకు డీజిల్ బస్సులు తిరిగే అవకాశమే లేదు. అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే. మంగళం, తిరుపతి, తిరుమల ఈ మూడు డిపోల నుంచే తిరుమలకు బస్సులు వెళ్లనున్నాయి. బయట జిల్లాల నుంచి వచ్చే బస్సులు సైతం ఈ డిపోలకు వచ్చి లింక్ టికెట్ రూపంలో తిరుమలకు వెళ్లనున్నాయి.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కోట్రేపల్లిలో తిరుపతి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. తీర్థం కోట్రేపల్లి, ఎం కొత్తూరు, మునిపల్లి, శెనిపల్లి, రామసముద్రం , గ్రామా ల్లో అనారోగ్యంతో ఉన్న ప్రజలు వంద మందికి పైగా హాజరు కాగా వారిని డాక్టర్లు పరిశీలించి తగిన మందులు, మాత్రలు ఉచితం గా అందించారు. ఆపరేషన్ అవసరమైన వారికి తిరుపతి రామాదేవి సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు జాతీయ అధ్యక్షులు పులిమామిడి యాదగిరి, జిల్లా అధ్యక్షులు ఎం ఎల్లారెడ్డి, బైరెడ్డిపల్లి మండల అధ్యక్షులు కే సుబ్రహ్మణ్యం, టీం లీడర్ కోట్రేపల్లి విశ్వనాథప్ప, రామచంద్రప్ప, రెడ్డప్ప నేతృతంలో వైద్యశిబిరం విజయ వంతంగా నిర్వహించారు.

అన్నదానం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : స్థానిక శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్టు వారు అన్నదానం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలకు చేరుకున్నవారు అందరికీ విందు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో పుష్పంత్, ఫౌండర్లు టి.మోహనలక్ష్మి, ఇ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై పోరాటం

ప్రజాశక్తి -పుంగనూరు: స్థానిక సమస్యలపై, విద్యుత్ చార్జీల పెంపుపై, ప్రభుత్వ పథకాల అమలు, పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇల్లు నిర్మాణం కోసం ఉద్యమించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, సహాయ కార్యదర్శి డాక్టర్ టి జనార్ధన్‌లు పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆ పార్టీ నాయకులు సమావేశం రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యల పై, విద్యుత్ ఛార్జీల పెంపుపై, పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం, ఐదు లక్షల రూపాయలతో పక్కా ఇల్లు నిర్మాణం, సూపర్ సిక్స్ హామీలు, అన్నదాత సుఖీభవ అమలుపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మున్నా, కృష్ణ, వెంకటరమణారెడ్డి, రత్నమ్మ పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ తనిఖీ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని వెలుగు భవనంలో 3 నెలలుగా జిల్లా బిసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ యూనిట్‌ను మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి శిక్షణా విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ శిక్షణ మహిళల జీవనోపాదికి ఎంతో తోడ్పడుతుందని వారి పిల్లల భవిష్యత్తు మెరుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం బాబా పాల్గొన్నారు.

పీఏపై అసత్యాలు సరికాదు: టిడిపి

ప్రజాశక్తి- కార్వేటినగరం : ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వ్యక్తిగత కార్యదర్శిపై అసత్యాలు చెప్పడం సరికాదని మండల టిడిపి యువ నాయకుడు పొద్దుటూరు రాజా పేర్కొన్నారు. యువ నాయకుడు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి పై జిల్లా కలెక్టరుకు కొందరు టిడిపి పార్టీలో లేనివారు వైసీపీకి చెందిన వారి పీఏగా తొలగించాలని వినతి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ నియోజక వర్గంలో ఎంతో అభివృద్ధి చేస్తుండడంతో వారికి మతి భ్రమించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఎలాంటి అవినీతికి పాల్పడకుండా నియోజకవర్గం అభివృద్ధి కోసం కష్టపడుతున్నారని తెలిపారు.

దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని వేవనపల్లి అది ఆంధ్రవాడ గ్రామంలోని దళిత పెద రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో దారి వసతి కల్పించాలని తహశీల్దారు పార్థసారథిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం శుక్రవారం తహశీల్దారు రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామంలోని రైతులతో చర్చించి దారి సౌకర్యాన్ని ఏర్పాటు చేయించారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు, తహశీల్దారుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.



100 గోకులం షెడ్లు మంజూరు

ప్రజాశక్తి-చౌడేపల్లి: చౌడేపల్లి మండలానికి విరివిగా 100 గోకులం షెడ్లను మంజూరు చేయించారు. పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, చౌడేపల్లి మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డిల ఆధ్వర్యంలో చౌడేపల్లి మండలానికి 100 గోకులం షెడ్లను మంజూరు చేయించారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్‌తో సంప్రదించి మండలంలో పాడి రైతులను ఆదుకునే నిమిత్తం ఎంత మొత్తంలో మొదటిసారి 100 గోకులం షెడ్లు మంజూరు చేశారు. ఈ మేరకు రూ 2.25 కోట్లు నిర్మాణానికి మంజూరు అయ్యిందని దీంతో మండలంలోని పార్టీ రైతులు చల్లా రామచంద్రారెడ్డి గువ్వల రమేష్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపిడివో అధ్యక్షతన శిక్షణ ఇస్తున్న అధికారులు

స్వమిత్వపై శిక్షణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: స్వమిత్వ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగం గా మండలంలో వివిధ గ్రామాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న స్వమిత్వలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామ కంఠం సరిహద్దులు గుర్తించడం , పౌరులకు వారి నివాస స్థలాలకు ఆస్తి హక్కు కల్పించడం, నిర్వహించే సంబంధిత సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజి, పరిపాలనాధికారి ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జున రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు అమరావతి, ప్రతాప్ రెడ్డి, గణేష్, రాము పాల్గొన్నారు.



వైసిపి నుండి కాంగ్రెస్‌లో చేరుతున్న ఫైజు

వైసిపి నుండి ఫైజు కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో వైసిపి నుండి ఫైజు కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. నామినేటెడ్ ఎంపీటీసీగా రెండు సార్లు కొనసాగిన ఫైజు వైసిపికి రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు వారు పుష్పగుచ్ఛం అందించారు. వారిని ఆమె పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.

ఓటర్ల జాబితాపై సమావేశం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, పోలింగ్ స్టేషన్ల పెంపు తదితర అంశాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తహశీల్దారు రవికుమార్ శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన చర్చించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేస్తామన్నారు. 1150 ఓటర్లకంటే ఎక్కువగా ఉంటే విడిగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటుచేస్తామన్నారు. నియోజవర్గంలో ప్రస్తుతం 226 పోలింగ్ స్టేషన్లు ఉండగా ప్రస్తుతం ఓటర్ల ప్రాతిపదికన 29 స్టేషన్లు పెరిగిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, మున్సిపల్ వివిధ పార్టీల నాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అరాచకానికి పాల్పడింది వైసీపీనే: టిడిపి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: గురువారం విజయానంద రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తేనబండ గంగా కాలనీలో చోటు చేసుకున్న ఘర్షణలో అరాచకానికి పాల్పడింది వైసిపి నాయకులు, కార్యకర్తలేనని టిడిపి నాయకులు సిఆర్‌రాజన్, దొరబాబు, సురేంద్ర కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా చిత్తూరు నగరంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానంద రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడంతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారని తెలిపారు. తేన బండ గంగా కాలనీకి చెందిన టిడిపి నాయకులు పచ్చప్పంపై వైసిపి కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. టిడిపి రాజ్యాంగ విలువలు ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఇలాంటి దాడులను సహించబోమని హెచ్చరించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో తమ పార్టీ జెండా ,బ్యానర్లను కూడా కట్టకుండా అడ్డుకున్న వైసిపి నేతలు నేడు ప్రజాస్వామ్య విలువల పై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

అధికార, ప్రతిపక్ష పార్టీల ఘర్షణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అధికార ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు ఘర్షణ పడ్డ సంఘటన స్థానిక తేనబండ గంగాకాలనీలో చోటు చేసుకుంది. వైసిపి చిత్తూరు నియోజవర్గ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి పుట్టినరోజు వేడుకలు తెనబండ గంగాకాలనీలో వైసిపి కార్యకర్తలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అధికార టిడిపి కార్యకర్తలు, వైసిపి కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో వైసిపికి చెందిన కార్యకర్తలు గాయపడ్డారు. వీరిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. వైసిపి కార్యకర్తలను టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడంతో దాడికి గురైన తమపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకొని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కార్యకర్తలను గాయపర్చడంతో పాటు ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేయడాన్ని పిరికిపంద చర్య అంటూ వైసిపి చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయా నందరెడ్డి తెలిపారు.

ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలి: కమిషనర్



పారిశుధ్యం, నీటి సరఫరాను తనిఖీ చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి- పలమనేరు: ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, నీటి సరఫరా తనిఖీలో భాగంగా నాగ మంగళం పంప్ హౌస్‌ను, నీటి బోర్లలో నీటి సామర్థ్యాన్ని నీటి లభ్యత లను క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి శుక్రవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, క్లోరిస్ టెస్ట్ (ఆర్‌సి టెస్ట్) ను చేసి ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని సిబ్బందికి తగు సూచన లు ఇచ్చారు. ఫైల్ లీకేజీ లను ఎప్పటి కప్పుడు అరికట్టాలని నీటి వృథా, కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నాణ్యమైన ఆహారం అందించాలని తుంబుకుప్పం ప్రాథమిక వైద్యాధికారి లోహిత్ చంగల్ రాయులు అన్నారు. మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యనభ్యసస్తున్న విద్యార్థినివిద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పలు సౌకర్యాలను ఏర్పాటు చేసిందని విద్య వైద్యం, నాణ్యమైన ఆహారం అందించాలని, వసతి గృహంలో దోమల వృద్ధి చెందకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు , పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, బిసి హాస్టళ్ల తనిఖీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఎస్‌సి, బిసి హాస్టళ్లను మండల వైద్య బృందం శుక్రవారం తనిఖీ చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులు తాగే నీటిని పరిశీలించింది. హాస్టలు మరుగుదొడ్లపై_లైట్లు, శుభ్రతపై ఆరా తీశారు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచిన స్థలాలు పరిశీలించి హాస్టల్ వార్డెన్‌లకు సూచనలు, సలహాలు అందించారు. భోజన కార్మికులకు శుభ్రతపై అవగాహన, హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించామని మండల వైద్యాధికారి డాక్టర్ విజయచంద్ర, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సావిత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయచంద్ర, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, వార్డెన్లు జై కుమార్, మురళి, ఆశ వర్కర్లు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టళ్లను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

చక్కని విద్యతోనే ఉన్నత శిఖరం

ప్రజాశక్తి- కార్వేటినగరం : చక్కని విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ పొన్న యుగంధర్ పేర్కొన్నారు. కార్వేటినగరంలోని ప్లస్ 2 బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ పొన్న యుగంధర్ ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 29 మంది విద్యార్థులకు శుక్రవారం యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. రెండు జతలు అందించడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం మర్రి శేఖర్ పేర్కొన్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా పొన్న యుగంధర్, ఎంఈఓ విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ పొన్న యుగంధర్ కలెక్టర్ సుమిత్ కుమార్‌తో మాట్లాడి విద్యార్థులకు యూని ఫామ్‌లు మంజూరు చేయిం చడం అభినంద నీయమన్నారు. పొన్న యుగంధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదువు కుంటూ ఉన్నత స్థాయికి ఎదగా లన్నారు. విద్యార్థుల దృష్టి అంతా చదువుపై మాత్రమే పెట్టా లని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్ మంజూరు చేసినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది హెచ్‌ఎం శేఖర్ ఆధ్వర్యంలో పొన్న యుగంధర్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు సెల్వి శోభన్ బాబు, రాఘవ, విజయ్, వెంకటేష్, ఉపాధ్యాయులు రవి , వేణుగోపాల్, మునేంద్ర, కన్నయ్య, రవి, శశికపూర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న పొన్న యుగంధర్

క్రైం న్యూస్



చోరీకి గురైన తాళం వేసిన ఇల్లు

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పుంగనూరు జాతీయ రహదారి సమీపంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. శీలంపల్లి గ్రామానికి చెందిన గాయత్రి కొంత కాలంగా బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో కాపురం వుంటోంది. ఈమె రెండు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. అదే సమయంలో దుండగులు ఆ ఇంటిపై కన్నేసి చోరీకి పాల్పడ్డాడు. ఐదు జతల కాలి వెండి చైన్లు, సుమారు రెండు గ్రాముల బంగారు కమ్మలు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితురాలు గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరశురాముడు తెలిపారు.

పశువుల కాపరిని ఢీకొన్న ట్రాక్టరు డ్రైవర్‌పై కేసు

ప్రజాశక్తి -సోమల: పశుల కాపరిపై నాలుగు రోజుల క్రితం అతి వేగంతో ట్రాక్టరుతో ఢీకొన్న డ్రైవరుపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్య గారి పల్లి సమీపంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 7 గంటల ప్రాంతంలో పుంగనూరు -సదుం మార్గంలో పశువులను తోలుకొని రోడ్డు పక్కగా వస్తున్న కరకమంద గ్రామానికి చెందిన షేక్ షోకత్ బాషా ను చౌడేపల్లి మండలం ఎల్లకుంట గ్రామానికి చెందిన గంగిరెడ్డి మామిడికాయల లోడుతో అతివేగంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తుండగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షేక్ షోకత్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. సమీప గ్రామస్తులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి నారాయణాద్రి ఆసుపత్రికి తరలించారు. గాయపడిన షేక్ షౌకత్ భాష కుటుంబ సభ్యులు దీనిపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

అదుపు తప్పిన స్కూలు బస్సు
తృటిలో తప్పిన ప్రమాదం



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అదుపు తప్పి స్కూలు బస్సు రహదారికి పక్కకు దూసుకు పోయి ఆగిపోయిన సంఘటన శుక్రవారం మండలం లోని రాగిమని పెంట రోడ్డు జంపు గుంత వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఒక ప్రైవేట్ పాఠశాల బస్సు ఉదయం విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చే సమయంలో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ముప్పు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వేలంపాట వాయిదా

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం సుబ్రహ్మణ్యస్వామికి ఆడి కృత్తిక ఉత్సవాలు ఆగస్ట్ 15,16,17,18వ తేదీలలో నిర్వహించనున్నారు. తలనీలాల వేలంపాట శుక్రవారం మధ్యాహ్నం స్కంధ పుష్కరిణి వద్ద ఆలయ ఈవో కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో ముగ్గురు మాత్రమే డిపాజిట్లు కట్టి వేలంపాట పాడారు. అయితే ఆలయానికి అనుకున్నంత ఆదాయం రాకపోవడంతో వేలం పాట వాయిదా వేసినట్లు ఎండోమెంట్ అలయ ఈవో కృష్ణ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ అధ్యక్షులు రవి యాదవ్, వాసుదేవరెడ్డి, రాజశేఖర్, హేమంత్ రెడ్డి, దాము, దాసరి గణేష్, చంద్రయ్య, శ్రీనివాసులు యాదవ్, దేవా రెడ్డి, ఎండోమెంట్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న పొన్న యుగంధర్

మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆర్ రామప్ప, ఉపాధ్యక్షులుగా రాధ

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆర్ రామప్ప , ఉపాధ్యక్షులుగా రాధను ఎన్నుకున్నట్లు డిసిసి అధ్యక్షులు బిజె అనిల్ శుక్రవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఆదేశం మేరకు బైరెడ్డిపల్లి మండలంలోని కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన ఆర్ రామప్పను బైరెడ్డిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా, నెల్లిపట్ల పంచాయతీకి చెందిన రాధాను మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా ఎనున్నకున్నట్లు డిసిసి అధ్యక్షులు బిజె అనిల్ పేర్కొన్నా రు. ఇకపై మండలంలోని గ్రామాల్లో ప్రతి పంచాయ తీలకు కాంగ్రెస్ నాయకులను నియ మిస్తామని, గతంలో కాంగ్రెస్‌కి చేదోడు వాదోడుగా ఉంటూ కర్తవ్యం నిర్వహించిన వారికి యూత్ బృందానికి గ్రామాల్లో త్వరలోనే పదవులు కట్టబెట్టి మండలంలో కాంగ్రెస్ ముందుకు సాగేలా చర్యలు చేపడతామని బి జే అనిల్ పేర్కొన్నారు.

మాజీ మంత్రి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి పట్టణంలోనే నేత్రప్రదాయణీ క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ మంత్రి ఆర్కేరోజా ఆలయంలో భక్తి శ్రద్దలతో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలుకగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేయించుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమె వెంట ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు వేణుబాబు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, ఇంద్రయ్య, మురుగ య్య, యాకోబు, కోఆప్షన్ సభ్యులు ఎల్లప ్రరెడ్డి, ఎన్‌సీ ఆనంద్ కుమార్, నాయకులు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం: టిడిపి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అది ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్య మవు తుందని కృష్ణమనాయుడు, రఘునాయుడు ధనుంజయ నాయుడు, వినోద్ నాయుడు, జ్యోతి యాదవ్, స్వామి దాస్ అన్నారు. ఈ సందర్భంగా జిడినెల్లూరు మండలంలోని వరత్తూరు పంచాయతీలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై కరపత్రాలు పంచుతూ అభిప్రాయం సేకరించారు. సంక్షేమాలు అందుతున్నా యా? లేదా ఆరా తీశారు. గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ యాదవ్, దేవసుందరం, శిల్ప, హరీష్ యాదవ్, కిరణ్ నాయుడు, ప్రసాద్ నాయుడు, కృష్ణమ నాయుడు, వెంకటేష్ నాయుడు, సోమశేఖర్, తులసిరామ్ పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు.

గుడిపల్లి: గుడిపల్లి మండలం కుప్పిగానీ పల్లి గ్రామ పంచాయ తీలో మండల టిడిపి అధ్యక్షుడు బాబు నాయుడు ఆధ్వర్యం లో 'సుపరిపాలనకు తొలి అడుగు' ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ పంచాయతీ లో గడపగడపకు వెళ్లి సమస్యలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకా లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి చార్జ్ బేటప్ప నాయుడు, సింగిల్ విండో ఛైర్మన్ రమేష్, ఆ పార్టీ పంచాయతీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామచంద్రుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరులో

మొక్కల పెంపకం

ప్రజాశక్తి- వికోట : మండల కేంద్రమైన వీకోటలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్ర ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో నూతన లయన్స్ క్లబ్ కార్యవర్గం డాక్టర్ తామీంఖాన్ అధ్యక్షతన ఏర్పడిన తర్వాత పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో అనేక సమాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్ క్లబ్ హరితహారం కార్యక్రమంలో భాగంగా 101 కొబ్బరి చెట్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సభ్యులందరూ కలసి నాటారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణానికి ప్రతి ఒక్కరూ మేలుచేయాలని, ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటాలని సూచించారు. అధ్యక్షులు డాక్టరు తమీమ్ ఖాన్ మాట్లాడుతూ పచ్చదనంతోనే మానవాళి భవిష్యత్తు ఆధారపడి వుందన్నారు. పట్టణంలోని మహాలక్ష్మి టెక్స్ టైల్స్ అధినేత లాబురాం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని కార్యదర్శి ఇంద్రేష్ తెలిపారు. కోశాధికారి సాదత్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న వాయుకాలుష్య నివారణకు చెట్లపెంపకమే సరైన పరిష్కారమని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు, డాక్టరు సురేంద్ర గౌడ , నాగరాజేంద్ర , వైస్ ప్రెసిడెంట్ తుకారామ్ , జెడ్‌పీ ధీరజ్ పాల్గొన్నారు.



పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు అన్యాయం: వైసిపి

ప్రజాశక్తి-చౌడేపల్లి: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు అన్యాయమని, ఇది ప్రభుత్వ పతనానికి నాంది అని వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చౌడేపల్లి జెడ్పిటిసి దామోదర్ రాజు, మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డిలు అన్నారు. ఎంపీ అరెస్టును నిరసిస్తూ మండల వైసిపి నాయకులు స్థానిక బస్టాండ్‌లో వైయస్సార్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయమని, ఇది కక్షపూరితమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రుక్మిణమ్మ, అంజిబాబు, మిద్దింటి శంకర్ నారాయణ, మిద్దింటి కిషోర్ కుమార్, కళ్యాణ్, భరత్, నరసింహ యాదవ్, సుధాకర్ రెడ్డి, హరీష్ రాయల్, పవన్ రాయల్, శ్రీరాములు, శ్రీరామ్ అరుణ్, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

బంగారుపాళ్యం: ఎంపీ మిథున్ రెడ్డి జైలు నుండి విడుదల కావాలని శుక్రవారం పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామని మండల కో ఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్ తెలిపారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మద్యం కేసుల నుండి విడుదల కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టామన్నారు. ఎంపీ పంపిణీ చేసిన నిధులలో షాది మహల్ నిర్మాణం చేపట్టామన్నారు. ఆయన కేసుల నుండి త్వరగా బయటికి రావాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు షాకీర్, అహ్మద్, లాల్, మున్నా, ఖాదర్ బాషా పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

